క్లుప్తంగా

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



ఫెర్టిలైజర్ షాప్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రకాశ్

జ్యోతినగర్: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని రామగుండం మండల వ్యవసాయాధికారి కె.ప్రకాశ్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్‌లో జై హనుమాన్ ఫెర్టిలైజర్ దుకాణాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు పరిశీలించారు. విక్రయిస్తున్న విత్తనాలను నాణ్యత పరీక్షించే నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. గొరిశెట్టి శ్రీనివాస్, హరీశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నర్రాశాలపల్లె రోడ్డు పనులు ప్రారంభం



జ్యోతినగర్: ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ రహదారి నుంచి నర్రాశాలపల్లె వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమై వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక డీసీసీ కార్యదర్శి మొహమ్మద్ రహీం, డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి రవితో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి రోడ్డు నిర్మాణానికి కలెక్టర్‌తో మాట్లాడి రూ.2కోట్లు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ పూర్తికావడం, ఇటీవల ఎమ్మెల్యే శంకుస్థాపన కావడంతో శుక్రవారం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



సూచనలు చేస్తున్న ఏవో అలివేణి

పెద్దపల్లిరూరల్: పంటలు సాగు చేసే రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి అలివేణి సూచించారు. రైతులకు పంటల సాగు, ఎరువుల వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎలాంటి సందేహాలున్నా రైతులు సమీపంలోని రైతువేదికల వద్ద ఏఈవోలను సంప్రదించవచ్చన్నారు. అలాగే రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు.

రద్దీ ప్రాంతాల్లో షీటీమ్ నిరంతర నిఘా



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఇన్‌చార్జి లావణ్య

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు షీటీం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా షీటీమ్ ఇన్‌చార్జి లావణ్య మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతీరోజు ప్రధాన కూడళ్లలో, విద్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో షీటీమ్ నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 63039 23700 నంబర్‌కు సమస్య తెలపాలని సూచించారు. ఎలాంటి ప్రమాదాలకు గురైనా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. షీటీమ్ సభ్యులు సురేశ్, స్నేహలత, పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

రామగుండం: టీటీఎస్ అంతర్గాంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పలువురు లబ్ధిదారులు శుక్రవారం ప్రారంభించారు. టీటీఎస్ అంతర్గాంకు చెందిన బాణాల అనూష అనే లబ్ధిదారు ముగ్గు పోసి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. అంతర్గాం తహసీల్దార్ తూం రవీందర్‌పటేల్, ఎంపీడీవో బైరి వేణుమాధవ్, సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పూదరి సత్తయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి అంకం రవీందర్, కాంగ్రెస్ అంతర్గాం మండల మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ మెహరాజ్, బాణాల యాదమ్మ, మాజీ సర్పంచ్ చింతల ప్రసన్న, బుజ్జిబాబు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ కోర్టు మూలమలుపు వద్ద గుంతలు



ఎంపీడీవో కార్యాలయం మూలమలుపు వద్ద గుంతలు

రోడ్డు గుంతలమయం

సుల్తానాబాద్: పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా నుంచి గట్టెపల్లి రోడ్డు వరకు గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీరాజ్ రోడ్ విస్తరణలో భాగంగా టెండర్ కైవసం చేసుకున్న కాంట్రాక్టర్ పనులు ఆలస్యంగా చేస్తున్నాడని ఆరోపణ ఉన్నాయి. చిరుజల్లులకే నీరు నిలవడంతో గుంతలు కనిపించక వాహనదారులు అందులో నుంచి వెళ్లడంతో వాహనాలు అదుపుతున్నాయి. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బల్దియాలో డ్రైడే ఫ్రైడే స్పెషల్ డ్రైవ్



కోల్‌సిటీ: టైర్లలోని నీళ్లను పారబోస్తున్న సిబ్బంది



ఫెర్టిలైజర్‌సిటీ: ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 100రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి నేతృత్వంలో శుక్రవారం గోదావరిఖని టీచర్స్ కాలనీలోని చిల్డ్రన్స్ పార్క్‌ను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. అలాగే డ్రైడే ఫ్రైడేను పురస్కరించుకొని ఇళ్లల్లో చాలాకాలంగా నిల్వ ఉన్న నీటిని పారబోయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల లార్వా పెరిగే అవకాశం ఉన్న పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, సీసాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. స్వశక్తి మహిళల సహకారంతో పరిసరాల పరిశుభ్రతపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డీఈ షాభాజ్, ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, కిరణ్, మెప్మా సీవో శ్వేత, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, వార్డు అధికారులు, ఆర్పీలు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వనీటిలో ఆయిల్‌బాల్స్

నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో కమిషనర్ జె.అరుణశ్రీ ఆదేశాల మేరకు శుక్రవారం నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధులను అరికట్టడంలో భాగంగా ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు వార్డు ఆఫీసర్ మంగ, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు.

చైతన్యపురికాలనీలో ఫ్రైడే డ్రైడే

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీలో నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశాలతో 100రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. నగరపాలక సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో కాలనీలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పాత డ్రమ్ములు, కూలర్లు, నీరు నిలిచిన ప్రదేశాలను గుర్తించి నీటిని తొలగించారు. నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. డివిజన్ ఆఫీసర్ సాయి, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, మెప్మా సిబ్బంది అనసూర్య, సరోజ, రజిత, చైతన్యపురి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఇరుకుల్ల సతీశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌కు సన్మానం



సన్మానిస్తున్న న్యాయవాదులు

మంథని: కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమితులైన న్యాయవాది బండ మాధురిని శుక్రవారం మంథని కోర్ట్ కాంప్లెక్స్‌లో న్యాయవాదులు సన్మానించారు. రామగిరి మండలం కల్వచర్లకు చెందిన న్యాయవాది మాధురి ఇటీవల నియామకమయ్యారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, సింగరేణి అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్, హైకోర్టు న్యాయవాది చంద్రుపట్ల రమణకుమార్ రెడ్డి, మంథని బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్, ట్రెజరర్ రాజేందర్, ప్రభుత్వ న్యాయవాది ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది లోకే రాధా కిషన్‌రావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి ఆర్ల నాగరాజు ఉన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

మంథని: కరీంనగర్‌లో ఈ నెల 29న నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మంథని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి వచ్చిన సందర్భంగా మాదిగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాకేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాణయ్య, ఏబీసీడీ ఉద్యమ నాయకుడు సంపత్ ఉన్నారు.

వంద ఎల్‌ఈడీ బల్బులు అందజేత



బల్బులు అందజేస్తున్న సాన రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: కమాన్‌పూర్ గ్రామపంచాయతీకి కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వంద ఎల్‌ఈడీ బల్బులను క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి అందజేశారు. కార్యదర్శి మారుతి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు మచ్చగిరి రాము, బండ సాయిశంకర్ ఉన్నారు.

మినీ హైడల్ డైరెక్టర్లకు సత్కారం



సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

పెద్దపల్లిరూరల్: మినీహైడల్ విద్యుత్ సంస్థ డైరెక్టర్లుగా నియమితులైన బాలరాజు, రాజశేఖర్‌రెడ్డి, నాగ్యను శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధలో కలిసి సత్కరించారు. ఎంప్లాయీస్ యూనియన్ –1535 సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు వజీర్, రాధాకృష్ణతో పాటు జెన్‌కో యూనిట్ నాయకులు రాము, కుమారస్వామి, శ్రీనివాసరెడ్డి, నగేశ్, శ్రీధర్, అబ్దుల్ తఖీ, ప్రసాద్, ధనయ్య, విజయ్‌కుమార్, కిషన్‌సింగ్, వెంకటి, నర్సయ్య, ముజఫర్ ఉన్నారు.

నూతన డైరెక్టర్లు రామగుండంపై దృష్టిసారించాలి

రామగుండం: ఇటీవల తెలంగాణ విద్యుత్ సంస్థల్లో నూతనంగా వివిధ విభాగాలకు డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌పీఈయూ–1535) రామగుండం బీ–థర్మల్ ఉద్యోగులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, ప్రధాన కార్యదర్శి గుర్రం కుమారస్వామి శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో బాధ్యతలు స్వీకరించిన పి.బాలరాజు, వై.రాజశేఖర్ రెడ్డి, బి.నాగ్య, వీర మహేందర్‌ను కలిసి సన్మానించారు. నూతన డైరెక్టర్లు రామగుండంపై ప్రత్యేక దృష్టిసారించాలని, స్థానికంగా 800 మెగావాట్ల సామర్థ్యం గల నూతన విద్యుత్ కేంద్రం స్థాపనకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ చేస్తున్న కృషికి నూతన డైరెక్టర్ల బృందం సహకరించాలని టీఎస్‌పీఈయూ రాష్ట్ర ప్రతినిధులు కోరారు.

బీఎంఎస్ బలోపేతానికి కృషి

జ్యోతినగర్: బీఎంఎస్ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని బీఎంఎస్ అనుబంధ రాష్ట్ర కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ రామగుండం–తెలంగాణ యూనిట్ అధ్యక్షుడు బండారి కనకయ్య అన్నారు. ప్రాజెక్టులోని స్టేజ్–1 హౌస్ కీపింగ్, స్టేజ్–2 పంప్ హౌస్ కార్మికులు శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యూనియన్ ముందుంటుందని అన్నారు. అనంతరం బండారి కనకయ్యను సన్మానించారు.

పారిశుధ్య సిబ్బంది ముందస్తు అరెస్టు



పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పారిశుధ్య సిబ్బంది

పాలకుర్తి: గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఛలో హైదారాబాద్ పిలుపు ఇచ్చింది. కాగా శుక్రవారం నిర్వహించిన ధర్నాకు వెళ్లకుండా పాలకుర్తి మండల పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, సీఐటీయూ మండల అధ్యక్షుడు బూడిద రామస్వామితో పాటు కుక్క అనిల్, రఫీక్, స్వామిని బసంత్‌నగర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జూలపల్లి: మండలంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్‌లతో పాటు సిబ్బందిని ఎస్సై సనత్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కారోబార్‌లు పురుషోత్తం, మధు, సూర్యనందం, సిబ్బంది అప్సర్, చంద్రమౌళి, లక్ష్మన్, సంపత్, అంజి, తిరుపతి, భాస్కర్ ఉన్నారు.

ధర్మారం: మండలంలోని పంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేశారు. సంఘం అధ్యక్షుడు ఆకుల రాజయ్య, నాయకులు కూనమల్ల అశోక్, దుల్ల రవికుమార్, ఉత్తెం రాజు ఉన్నారు.

ఓదెల: మండలంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో పైడిపల్లి నాగయ్య, గుర్రం సారయ్య, చిటికేసి ప్రభాకర్, బాపు, నరేశ్ ఉన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కారోబార్లను సుల్తానాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, మండల అధ్యక్షుడు రమేశ్, సంపత్, విద్యాసాగర్, వికాస్ ఉన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

రామగుండం: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. పంచాయతీ కార్మికులు హైదరాబాద్‌కు తరలకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అంతర్గాం పోలీసులు పంచాయతీ కార్మిక సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, రాజలింగు, ముత్యాలు, రాజశేఖర్, వివి.శ్యాం, పోశంను అదుపులోకి తీసుకున్నారు.

పాఠశాలకు ఫ్రిడ్జ్, ప్రొజెక్టర్ అందజేత



ఫ్రిడ్జ్, ప్రొజెక్టర్ అందజేస్తున్న సత్యనారాయణ

ఓదెల: మండలంలోని కొలనూర్ హైస్కూలు విద్యార్థులకు పూర్వవిద్యార్థి దేవరకొండ సత్యనారాయణ ఫ్రిడ్జ్, ప్రొజెక్టర్ శుక్రవారం అందజేశారు. ఎంఈవో ఎర్ర రమేశ్, ప్రధానోపాధ్యాయులు ఏసుదాస్, మన ఊరు మనబడి వేదిక పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు స్వర్ణ తెలిపారు. శనివారంఉదయం స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందని, లబ్ధిదారులు హాజరు కావాలన్నారు.

మాతాశిశు ఆస్పత్రి సందర్శన

మంథని: మంథనిలోని మాతాశిశు ఆస్పత్రిని శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్ సందర్శించారు. ఆడబిడ్డలకు అందుతున్న సేవలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవించిన ఆడబిడ్డలకు పండ్లు అందజేశారు. అలాగే వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్, నర్స్‌ను సన్మానించారు. నాయకులు ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, మాచిడి రాజుగౌడ్, జంజర్ల శేఖర్, వేల్పుల గట్టయ్య ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం కేటాయించాలి



మాట్లాడుతున్న రాజయ్య

సుల్తానాబాద్‌రూరల్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చెప్పినట్లుగా బీసీలకు జనాభా ప్రాతిపదికన 42శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేశ్‌గౌడ్, సంఘం నాయకులు బక్కయ్య, కుందేళ్ల తిరుపతి, గోవర్ధన్, కోటేశ్వర్‌రావు, కనకయ్య, సంపత్, ఓదెలు, మహేశ్, ప్రవీణ్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

రెండు ఏరియాల్లో క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన ఆర్జీ–2 ఉద్యోగులు

గోదావరిఖని: రామగుండం రీజియన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సెలింగ్ శుక్రవారం ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. ఏరియాలోని డీ, టీ–2, ఎస్టీటూ టైప్ క్వార్టర్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. సీనియారిటీ, అర్హత, గ్రేడ్, పదవిని బట్టి క్వార్టర్లను కేటాయించారు. 310 క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, శ్రీనివాస్, సంక్షేమ అధికారి నాగరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ వూట్ల దేవాచారి పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో క్వార్టర్ల కౌన్సెలింగ్

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2లో శుక్రవారం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీ–2 ఏరియా, జీడీకే–11, ఓసీపీ–1 ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, పర్సనల్ డీజీఎం అరవిందరావు పాల్గొన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో 540 క్వార్టర్లకుగాను 200మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్‌కు 105 మంది హాజరు కాగా, అందులో 69మంది ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు.

డీజీఎంకు సన్మానం



సన్మానిస్తున్న బీఎంఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2ఏరియా పర్సనల్ డీజీఎం అరవింద్ రావు ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకులు శుక్రవారం ఆయనను కలిసి సన్మానించారు. బీఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వేణుగోపాల్‌రావు, రవీందర్, కుమారస్వామి, గట్టు శ్రీనివాస్, ప్రసాద్, రవి, శివాజీ, తిరుపతి పాల్గొన్నారు.

సంస్థలో యాక్టింగ్ క్లర్క్‌లను క్రమబద్ధీకరించాలి



డైరెక్టర్(పా)కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సంస్థవ్యాప్తంగా పనిచేస్తున్న యాక్టింగ్ క్లర్క్‌లను క్రమబద్ధీకరించాలని గుర్తింపు సంఘం, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలోని ఇల్లెందు క్లబ్‌లో డైరెక్టర్(పా) గౌతం పొట్రు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 51వ నిర్మాణాత్మక సమావేశం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. సంస్థలో పనిచేస్తున్న యాక్టింగ్ క్లర్క్‌లను క్రమబద్ధీకరించాలని, సెక్యూరిటీ గార్డుల ఖాళీలను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీలను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. తక్కువ గ్రేడ్ నుంచి ఉన్నత స్థాయి గ్రేడ్‌కు మారినప్పుడు వారికి ప్రమోషన్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, లేబర్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రిల్ ఆపరేటర్ల కేడర్ స్కీమ్ కేసును పరిష్కరించాలన్నారు. కారుణ్య నియామకాల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. సమావేశంలో జీఎంలు మనోహర్, సుబ్బారావు, రఘురామిరెడ్డి, కవితానాయుడు, కిరణ్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే విజయం



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి, సంజీవరెడ్డి

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు సాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అమలు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జంకుతోందన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. నాయకులు పర్శ సమ్మయ్య, పల్లె సదానందం, తూడి రవీందర్, దిలీప్ ఉన్నారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

ఎలిగేడు: కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ యాకన్న, ఎలిగేడు ఎస్సై సత్యనారాయణలు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేజ్‌వీల్స్ ట్రాక్టర్ రోడ్డుపై మొదటిసారి పట్టుబడితే రూ.5వేలు, రెండోసారి పట్టుబడితే రూ.10వేలు, మూడోసారి పట్టుబడితే రూ.20వేల జరిమానా విధిస్తూ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై తిప్పవద్దని, రోడ్లు పాడవకుండా చూడాలని సూచించారు. రాత్రి వేళల్లో ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, మండలంలోని అన్ని గ్రామాల ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయం అందుబాటులోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మంథని: మంథనిలో మూలనున్న గ్రంథాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి మార్చాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ సంఘాలు శుక్రవారం గ్రంథాలయాన్ని సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంథనిలో ఉన్న గ్రంథాలయం మూలగట్టున శిథిలావస్థలో ఉందన్నారు. మంచినీటి సమస్య, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పాఠకులకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి పాఠ్య పుస్తకాలు, మెటీరియల్ గ్రంథాలయంలో లేకపోవడం శోచనీయమన్నారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ వారానికి రెండు రోజులు వచ్చి వెళ్తుండడంతో పర్యవేక్షణ లోపించిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేశ్, నాయకులు బావు రవి, విరుగురాల ప్రసాద్ ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలేవీ?

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌నగర్‌లో ప్రభుత్వ అనుమతి పొందకుండానే ఏర్పాటు చేసిన పాఠశాలపై విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నాయకుడు ఠాకూర్ విజయ్‌సింగ్ ప్రశ్నించారు. అనుమతి లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించి తల్లిదండ్రులు మోసపోతున్నారని పేర్కొన్నారు. అధికారులు నోటీసులతోనే సరిపెడుతుండడం విస్మయం కలిగిస్తోందన్నారు. కలెక్టర్ నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.